ఖమ్మంలో సీతారామం

మొదటిపేజీ తరువాయి...

జిల్లాకు కూడా నీరందించేందుకు పనులు చేపట్టింది. మూడు జిల్లాల్లో కలిపి మొత్తంగా 6,74,387 ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు శ్రమించింది. ట్రయల్ రన్ తరువాయి అనే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, మంత్రి తుమ్మల

ట్రయల్ రన్ సక్సెస్

ఆరు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని తన గొప్పగా చెప్పుకుంటున్నది. గురువారం జిల్లాకు వచ్చిన నలుగురు మంత్రులు.. కనీసం వ్యూ పాయింట్ నుంచి కూడా ప్రాజెక్టును పరిశీలించలేదు. కేవలం సీతమ్మబరాజ్‌ను, కాలువను పరిశీలించి వెళ్లారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన పంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. కుమ్మరిగూడెం వద్ద నుంచి తొమ్మిది కిలోమీటర్లు గ్రావిటీ ద్వారా బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వరకు చేరనున్న గోదావరి జలాలు ఎత్తిపోతల ద్వారా ఒక్కసారిగా పరవళ్లు తొక్కాయి. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లోనే వైరా రిజర్వాయర్ వరకు గోదావరి జలాలను పారిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాడు విమర్శలు.. నేడు గొప్పలు..

'ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సీతారామ ప్రాజెక్టు ఒక భారీ కుంభకోణం. స్వతంత్ర భారతదేశంలో ఇంతటి అక్రమాన్ని చూడలేదు. రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు' అని సచివాలయంలో జరిగిన సమీక్షలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉండగానే.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. కానీ ప్రస్తుతం సదరు కాంగ్రెస్ నేతలే ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు ప్రారంభించిన ఘనత తమదని గప్పాలు కొడుతుండడం గమనార్హం. ఎగిసిపడుతున్న గోదావరి నీళ్ల పరవళ్లకు ప్రణామాలు చేస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్న కాంగ్రెస్ నేతలపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. '6 నెలల్లో ప్రాజెక్టు కంప్లీట్ చేయడం ఎప్పుడైనా చూశారా? దటీజ్ కాంగ్రెస్. 2014లో పడావుపడ్డ ప్రాజెక్టును 6నెలల్లో కంప్లీట్ చేయాలంటే చిత్తశుద్ధి ఉండాలె. కడుపు నోరు కట్టుకుని పనిచేయాలె'అంటూ బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా సెటైర్లు వేయగా, కాంగ్రెస్ నేతలు ఆ పోస్టును పొగడ్తగా భావిస్తూ సోషల్‌మీడియాలో వాడుకోవడం కొసమెరుపు. కరువును పారదోలే కల్పతరువైన ఈ సీతారామ ప్రాజెక్టు ఫలితమంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనంటూ చర్చించుకున్నారు.

చేసింది కేసీఆర్.. చెప్పుకునేది కాంగ్రెస్

సీతారామ ప్రాజెక్టుకు పునాది వేసింది.. పూర్తి చేసింది కేసీఆర్. కానీ దాని ఫలితం గురించి కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది. వారు ఎన్ని గప్పాలు చెప్పుకున్నా. మాజీ సీఎం కేసీఆర్ కల నెరవేరింది. గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నాయి. అప్పటి కాంగ్రెస్ నాయకులే ఎన్నో కేసులు వేసి సీతారామను ఆపాలని చూశారు. కేసీఆర్ ఉక్కు సంకల్పం ముందు వారి పాచికలు పారలేదు. కేంద్రంతో పోరాడి కేసీఆర్ అన్ని అనుమతులూ తెచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం ఏనాడూ తట్టెడు మట్టిపోయని కాంగ్రెస్ మంత్రులు ఇప్పుడొచ్చి ట్రయల్ పేరుతో హడావిడి చేశారు. సీతారామ ప్రాజెక్టు ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే.

– రేగా కాంతారావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే

కేసీఆర్ మహాసంకల్పం నెరవేరిన రోజు

సీతారామ ప్రాజెక్టు ప్రారంభంపై కేటీఆర్

హైదరాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా కరువును శాశ్వతంగా పారదోలేందుకు ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు ప్రారంభంతో కేసీఆర్ మహాసంకల్పం నెరవేరిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సీతారామ ప్రాజ క్టు నా గుండెకాయ అని ఆనాడే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారని ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. 'మరో స్వప్నం సాకారమైన క్షణమిది..కేసీఆర్ మహాసంకల్పం నెరవేరిన రోజు ఇది..!' అని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను కేసీఆర్ పరుగులు పెట్టించారని, పటిష్ట ప్రణాళికలను యుద్ధప్రాతిపదికన అమలు చేశారని గుర్తుచేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 లక్షల ఎకరాల్లో పచ్చని పంటలకు బంగారు బాటలు వేశారని చెప్పారు. ఖమ్మంలోని ప్రతి ఇంచుకు ఇక ఢోకా లేదని, దశాబ్దాలపాటు దగాపడ్డ రైతుకు ఇక చింత లేదని అన్నారు. కాలమై నా, కాకపోయినా.. పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలతో ఖమ్మం రైతుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండుతాయని తె లిపారు. కేసీఆర్ కలను సాకారం చేయడం ద్వారా ఈ 'జలవిజయం'లో భాగస్వాములైన నీటిపారుదల అధికారులు, సిబ్బందికి అభినందనలు. కష్టపడిన ప్రతిఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలని పేర్కొన్నారు.

వార్షిక నివేదికలేవి ?

వార్షిక ప్రగతి నివేదికలను విడుదల చేసే సాంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఆయా శాఖల వారీగా ప్రభుత్వం సాధించిన విజయాలను రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న విడుదల చేయడం సాంప్రదాయంగా వస్తున్నదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాంప్రదాయాన్ని తుంగలో తొక్కిందని కేటీఆర్ పేర్కొన్నారు.

తప్పు నాదే!

మొదటిపేజీ తరువాయి...

జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. తమ ప్రభుత్వ విధానాలు నచ్చి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఇది జీవన్‌రెడ్డిని మనస్తాపానికి గురిచేసిందని తెలిపారు. అయినప్పటికీ మంత్రి శ్రీధర్ బాబు ఈ సమస్యను పరిష్కరించడానికి చొరవ తీసుకున్నారని తెలిపారు. జీవన్‌రెడ్డి అనుభవం, పార్టీపై ఆయన కున్న కమిట్‌మెంట్‌ను అధిష్ఠానం గుర్తించిందని, ఆయన గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని చెప్పారు. జీవన్‌రెడ్డి తన అనుభవాన్ని ఉపయోగించి ఇకపై రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారన్న ఆశాభావాన్ని రేవంత్ వ్యక్తంచేశారు. జీవన్‌రెడ్డి విషయంలో కొందరు ప్రభుత్వానికి, పార్టీకి మధ్య ఏదైనా జరిగితే బాగుండునని ఎదురుచూశారని అన్నారు. వారి ఆశలు నెరవేరే అవకాశం జీవన్ రెడ్డి ఇవ్వలేదని చెప్పారు.

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు అనడం సిగ్గుచేటు

- రేవంత్ స్వగ్రామంలో బీజేపీకే మెజారిటీ వచ్చింది
- అక్కడ కమలానికి కాంగ్రెస్ ఓట్లు మళ్లించారా?
- మహబూబ్‌నగర్, మల్కాజిగిరిలో బీజేపీ ఎలా గెలిచింది?
- ఢిల్లీలో సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలపై హరీశ్

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించడం విడ్డూరంగా ఉన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆక్షేపించారు. మెదక్‌లో బీజేపీని బీఆర్ఎస్ పార్టీయే గెలిపించిందని సీఎం స్థాయి వ్యక్తి గాలి మాటలు మాట్లాడటం సరికాదని హితవుపలికారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా రేవంత్ తీరుపై మండిపడ్డారు. మెదక్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అందులో మూడుచోట్ల బీఆర్ఎస్ మెజారిటీ సాధించిందని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు సొంత నియోజకవర్గం దుబ్బాకలో కూడా బీఆర్ఎస్ మెజారిటీ ఎలా సాధించిందని నిలదీశారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో బీజేపీకి మెజారిటీ వచ్చిందని, రేవంతే అక్కడ బీజేపీకి కాంగ్రెస్ ఓట్లు మళ్లించారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారని, వారంతా కలిసి బీజేపీని గెలిపించారా? అని నిలదీశారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి 32 వేల మెజారిటీతో గెలిచారని, లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 21 వేల మెజారిటీ మాత్రమే వచ్చిందని గుర్తుచేశారు. మిగతా ఓట్లను రేవంత్‌రెడ్డి బీజేపీకి వేయించారా? అని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో బీజేపీ భారీ మెజారిటీతో ఎలా గెలిచిందని నిలదీశారు. ఈ రెండు చోట్ల బీజేపీని కాంగ్రెస్ గెలిపించిందా? అని ప్రశ్నించారు.

మోదీని పెద్దన్న అని అన్నదెవరు?

బీజేపీ పంచన చేరి ప్రధాని మోదీ శరణుజొచ్చింది రేవంత్‌రెడ్డేనని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి బీజేపీ ఎజెండాను అమలు చేస్తున్నారని ఆరోపించారు. నిండుసభలో మోదీని పెద్దన్న అని సంబోధించింది రేవంత్‌రెడ్డి కాదా? అని నిలదీశారు. మోదీ, రేవంత్‌రెడ్డి కుమ్మక్కై సింగరేణిని ప్రైవేటుపరం చేస్తున్నారని దుయ్యబట్టారు. విభజన హామీలపై మోదీ ప్రభుత్వాన్ని రేవంత్ గట్టిగా నిలదీయడం లేదని విమర్శించారు. రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రాంతీయ శక్తి అయిన బీఆర్ఎస్‌ను టార్గెట్ చేశాయని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సీఎం కావాలన్న కోరిక తీరింది

- కేసీఆర్‌ను గద్దె దించే లక్ష్యం పూర్తి
- పీసీసీ బాధ్యతలు ఎవరికైనా ఓకే
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి
- ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): కేసీఆర్‌ను గద్దె దింపాలన్న తన జీవిత లక్ష్యం నెరవేరడంతోపాటు ముఖ్యమంత్రిని కావాలనే తన కోరిక తీరిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తన ముందున్నది తెలంగాణ పునర్నిర్మాణం మాత్రమేనని అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పదవీకాలం ముగిసిందని, ఆ స్థానంలో ఎవరిని నియమించినా కలిసి పని చేస్తానని చెప్పారు. తన పదవీ కాలంలోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటింగ్ శాతం పెరిగిందని గుర్తుచేశారు. తెలంగాణలో కేసీఆర్ పూర్తిగా చేతులెత్తేశారని.. అందుకే బీజేపీ బలం పెరిగిందని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా ధ్వంసమైందని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వచ్చిన చోట తాము గెలిచామని, బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిన చోట బీజేపీ గెలిచిందని అన్నారు. తాను కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోనని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని లోక్‌సభలో జీరో చేశామని.. ఆ పార్టీని సున్నా చేయాలన్న తన కోరిక నెరవేరిందని తెలిపారు.

పునాదులు వేసింది ఎవరు?

ఫిరాయింపుల విషయంలో కేసీఆర్ పార్టీ గగ్గోలు పెడుతున్నదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఫిరాయింపులకు అసలు పునాదులు వేసింది ఎవరని ప్రశ్నించారు. 61 మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను లాగేసుకున్నది ఎవరు? అని నిలదీశారు. ఆ పార్టీ చేసిన పాపాలకు తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కేసీఆర్ ముక్కు నేలకు రాయాలని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న తమ ప్రభుత్వం పడిపోతుందని, వంద రోజులు కూడా ఉండదని ప్రచారం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. దీనికి కేటీఆర్, హరీశ్ వంతపాడారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం పడిపోతుందంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. చేతబడి చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వాడిని చూస్తూ కూర్చుంటామా? చెట్టుకు కట్టేయమా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో 17 లోక్‌సభ సీట్లలోనూ ఓడిపోయి, 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయి, 14 చోట్ల మూడో స్థానంలో నిలిచాక కూడా కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో 37.5 శాతం ఓట్లు వస్తే లోక్‌సభ ఎన్నికల్లో 16 శాతానికి పడిపోయాయని అన్నారు.

బీఆర్ఎస్ కంచుకోటలో బీజేపీకి సమానంగా ఓట్లా?

లోక్‌సభ ఎన్నికల్లో కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో బీజేపీకి ఫస్ట్ ప్లేస్ వస్తుందా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ఎంతగా కలిసి పనిచేశాయో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని అన్నారు. సిద్దిపేటలో బీజేపీ, బీఆర్ఎస్‌కు సమానంగా ఓట్లు వచ్చాయని.. కంచుకోట మెదక్‌లో బీఆర్ఎస్ మూడోస్థానంలో నిలిచిందని కాబట్టి కేసీఆర్‌కు ఇకనైనా కనువిప్పు కలిగితే మంచిదని అన్నారు.

బీఆర్ఎస్ కూడా ఫిర్యాదు చేయలేదు

తాము అధికారంలోకి వచ్చాక జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో చిన్న ఘటన కూడా జరగలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. పొరుగు రాష్ట్రం ఏపీలో ఎన్నికల తర్వాత 40, 50 మంది అధికారులను తొలగించారని గుర్తుచేశారు. ఇక్కడ చివరికు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా తమపై ఫిర్యాదు చేయలేకపోయిందని తెలిపారు. పాలనను సమర్థంగా నిర్వహించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక అన్ని మతాల పండుగలు బ్రహ్మాండంగా జరిగాయని, మతపరమైన హింస ఎక్కడా చిన్నది కూడా జరగలేదని చెప్పారు. ఒక్క రాజకీయ ప్రేరేపిత కేసు కూడా పెట్టలేదని తెలిపారు. దీనిని బట్టి పాలన బాగున్నట్టా? బాగా లేనట్టా? అని ప్రశ్నించారు. తమ పాలనను ఇతర రాష్ట్రాలతో పోల్చి చెప్పాలని కోరారు. కేంద్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వంతో బీజేపీ రాష్ట్రాలు కూడా అపాయింట్‌మెంట్ తీసుకోలేదని, తామే మొదటగా వచ్చి అపాయింట్‌మెంట్స్ తీసుకున్నామని చెప్పారు.

మీడియాకు సీఎం పాఠాలు

రాజకీయ పార్టీలు నడిపే పత్రికలు, టీవీల మాయలో ఇతర మీడియా పడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆ మీడియాకు వారి రాజకీయ పార్టీల ప్రయోజనాలను కాపాడటానికి తప్పుడు వార్తలు రాస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. అలా చేయడంలో తప్పులేదని, అయితే మిగతా మీడియా కూడా వారి మాయలో పడి కొట్టుకుపోతున్నదని అన్నారు.

రాష్ట్రంలో టీడీపీ పోటీచేసి ఉంటే.. కాంగ్రెస్ పార్టీ గెలిచేదో.. కాదో

- చంద్రబాబును కించపరచను: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీచేసి ఉంటే అప్పుడు కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉండేదోనని సీఎం రేవంత్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీ కనీసం 10 శాతం ఓట్లు దక్కించుకొనేదని చెప్పారు. అప్పుడు కచ్చితంగా తమ పార్టీ గెలుపోటములు ప్రభావితమై ఉండేవని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో గురువారం సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఏపీలో చంద్రబాబునాయుడు 23 సీట్లు వచ్చినా కోర్ రాజకీయాలను వదలకుండా పోరాడారని, అందుకే మళ్లీ గెలవగలిగారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ పరిస్థితి అలా లేదని చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లు వారి ఓట్లు వారే వేసుకొని ఉంటే కాంగ్రెస్ 12 సీట్లు గెలిచేదని అభిప్రాయపడ్డారు. చంద్రబాబునాయుడిని కించపరిచేలా మాట్లాడనని, ఆయనని అనాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు.

కేసులు పెడితే.. పనులు కావు

గత ప్రభుత్వంపై కేసులన్నీ ఒకేసారి ఓపెన్ చేస్తే.. ఒక్కపనీ పూర్తిచేయలేనని రేవంత్‌రెడ్డి అన్నారు. 'అన్నీ స్తంభించిపోతాయి, ఆయా శాఖలలో ఎంతమందినని తొలగిస్తాం. నేను ఏ విచారణకు ఆదేశించినా అందులో ప్రైవేటు ఇన్ఫ్రా కంపెనీలు, ఇతర సంస్థలు కూడా ఉంటాయి. అందులో కేవలం ప్రభుత్వ సంస్థలు, కేసీఆర్ ఒక్కడే ఉండరు. ఒకసారి కేసు నమోదైతే బ్యాంకులు రూపాయి రుణం ఇవ్వవు ఓడీలను వెనక్కు తీసుకుంటాయి. అప్పులు తీర్చమని ఒత్తిడి తెస్తాయి. దాంతో రాష్ట్రంలో రూపాయి పెట్టుబడి పెట్టడానికి ఎవ్వరూ ముందుకురారు' అని చెప్పారు. హైదరాబాద్‌లో వైఎస్ జగన్ ఇంటిముందు కూల్చివేతల గురించి తనకు ఎవరూ చెప్పలేదని అన్నారు. బయట మాత్రం చంద్రబాబు చెప్తేనే చేయించినట్టు ప్రచారం చేశారని అన్నారు.

నావల్లనే రాహుల్ ప్రతిపక్షనేత

లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవి రాహుల్‌గాంధీ తీసుకోవాలని సీడబ్ల్యూసీలో ఏకగ్రీవ తీర్మానం చేయడానికి తానే చొరవ తీసుకున్నానని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాహుల్ గాంధీకి అద్భుతమైన జ్ఞానం ఉందని ప్రశంసించారు. ప్రధాని మోదీ రాజకీయ ప్రభ సృష్టించుకున్నారే తప్ప లోతైన జ్ఞానం లేదని వ్యాఖ్యానించారు.

అమరావతి పోటీ కాదు

హైదరాబాద్‌కు ఏపీ రాజధాని అమరావతి పోటీ కాదని రేవంత్ పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల లక్షల ఎకరాల భూములున్నాయని, నగరంలో ఒకవైపు ఉన్నవారు మరోవైపు వెళ్లడానికి ఇష్టపడటం లేదని చెప్పారు.

పాత బస్తీలో విద్యుత్తు బిల్లుల వసూలుకు అదానీ!

హైదరాబాద్ పాత బస్తీలో 40 శాతం విద్యుత్తు బిల్లులు వసూలు కావడం లేదని సీఎం రేవంత్ చెప్పారు. దీన్ని సరిదిద్దడానికి ఆదానీ వాళ్లను పిలిచామని తెలిపారు.

విద్యుత్తు కమిషన్‌పై కేసీఆర్ పిటిషన్ సబబే

మొదటిపేజీ తరువాయి...

సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించింది. అయితే, విద్యుత్తు విచారణ సంఘం కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగుస్తున్నదని, కమిషన్ తన విచారణ నివేదికను ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉన్నదని సోంధి పేర్కొన్నారు. గడువు పమీపిస్తున్న కారణంగా విచారణపై స్టే విధించాలని ఆయన కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషన్‌కు నెంబర్ కేటాయింపుపై రిజిస్ట్రీ లేవనెత్తిన అంశం వరకే నేటి(గురువారం) విచారణ పరిమితమైందని అందువల్ల కమిషన్‌పై స్టే జారీ చేయలేమని స్పష్టం చేసింది. కేసీఆర్ పిటిషన్‌లోని అంశాలపై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించింది.

విచారణ పూర్తికాకముందే నిర్ణయానికి

కేసీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి వాదనలు వినిపించారు. విచారణ ఎలా ఉండాలో కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌లోనే దిశానిర్దేశం చేసినట్టుగా ఉన్నదని, ఇది చట్ట వ్యతిరేకమని తెలిపారు. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కూడా ఏకపక్షంగా వ్యవహరించారని చెప్పారు. పిటిషనర్ విచారణకు హాజరుకావాలని ఏప్రిల్ 14న విచారణ సంఘం నోటీసులు జారీ చేసిందని, అయితే లోక్‌సభ ఎన్నికల ప్రచార హడావుడిలో ఉన్నందున తనకు జూన్ 15వ తేదీ వరకు గడువు ఇవ్వాలంటూ కేసీఆర్ కమిషనర్‌కు లేఖ రాశారని వివరించారు. అయితే అంతలోనే జస్టిస్ నరసింహారెడ్డి ఈ నెల 11వ తేదీన విలేకరుల సమావేశం నిర్వహించారని చెప్పారు. ఈ సందర్భంగా ధర్మాసనం కల్పించుకొని 'జస్టిస్ నరసింహారెడ్డి ప్రెస్‌కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారా?' అని ప్రశ్నించారు. దీనికి సోంధి అవునని సమాధానం ఇచ్చారు. 'విలేకరుల సమావేశం నిర్వహించడమే కాదు, అప్పటివరకు జరిపిన విచారణ గురించి కూడా ఆయన బాహాటంగా వెల్లడించారు. పైగా విద్యుత్ కొనుగోలు ధర ఎక్కువగా నిర్ణయించారంటూ విచారణ పూర్తికాకముందే ఒక నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే విచారణలో 25 మందిని గుర్తించామని, మాజీ సీఎం కేసీఆర్, మరొక అధికారిని విచారణకు రావాలని నోటీసులు ఇస్తే గడువు కోరారని కూడా జస్టిస్ నరసింహారెడ్డి చెప్పారు. పూర్తి స్థాయిలో విచారణ ముగించకుండానే, పిటిషనర్ వాదనలు వినకుండానే ఏకపక్షంగా తన వైఖరిని బహిర్గతం చేయడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం' అని సోంధి గుర్తు చేశారు. జస్టిస్ నరసింహారెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించడాన్ని తప్పుపడుతూ కేసీఆర్ లేఖ రాశారని సోంధి పేర్కొన్నారు. పరిధిని దాటిన కారణంగా విచారణ నుంచి తప్పుకోవాలని కోరారన్నారు. దీనిపై జస్టిస్ నరసింహారెడ్డి నుంచి స్పందన రాలేదన్నారు. తప్పు జరిగిపోయిందంటూ నోటీసు దశలోనే కమిషన్ నిర్ణయానికి వచ్చేయడాన్ని, ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో వెల్లడించడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. కమిషన్ ఈ నెల 30న ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నదని తెలిపారు. ఆలోగా హైకోర్టు స్పందించాలని కోరారు.

జస్టిస్ ఎల్ఎన్ఆరే స్వయంగా చెప్పారు

'పీలా పోతినాయుడు ఏలేరు కుంభకోణం'పై ఏర్పాటైన జస్టిస్ బీకే సోమశేఖర కమిషన్‌ను సవాల్ చేసిన కేసులో హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి స్వయంగా వెలువరించిన తీర్పు ఈ కేసుకు బాగా వర్తిస్తుందని ఆదిత్య సోంధి తెలిపారు. విచారణ కమిషన్ బాధ్యతలు నిర్వహించే వ్యక్తికి కాండక్ట్ ఉండాలని ఆ తీర్పులో పేర్కొన్నారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ఘటనలో విచారణ సంఘం తన బాధ్యతలను పక్షపాతంగా, ఏకపక్షంగా నిర్వర్తిస్తున్నదని, విలేకరుల సమావేశంలో వెల్లడించిన విషయాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ ప్రకారం ఏర్పడే విచారణ సంఘాలకు నిర్దిష్ట బాధ్యతలు మాత్రమే ఉంటాయని రామకృష్ణ దాల్మియా కేసులో కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా

*గతంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం, మాజీ సీఎం కే విజయభాస్కర్‌రెడ్డి మధ్య జరిగిన కేసులో హైకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ తీరు ఉన్నదని సోంధి వాదించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ సెక్షన్ 8(3) విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని తెలిపారు. ధర్మాసనం వెలువరించిన ఆ తీర్పులో కమిషన్‌కు న్యాయపరమైన అధికారాలు లేవని చెప్పిందని గుర్తుచేశారు. విచారణ సంఘం విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక మాత్రమే ఇవ్వాలని, ఎవరికైనా శిక్షలు విధించడం, జరిమానాలు విధించడం వంటి ఉత్తర్వుల జారీ అధికారం కమిషన్‌కు ఉండవని సుప్రీంకోర్టు కూడా స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఉదాహరణకు మానవ హక్కుల కమిషన్ సిబ్బందికి జీతాలు చెల్లించాలన్న ఉత్తర్వులను రాజ్యాంగ ధర్మాసనాలు రద్దు చేశాయని గుర్తు చేశారు. కమిషన్ న్యాయ నిర